క్లుప్తంగా

పార్వతీదేవి ఆలయంలో మర్రి పూజలు



యడ్లపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను 18 మందిని ప్రకటించారు. పార్టీ గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మర్రి రాజశేఖర్‌ను ఎమ్మెల్యేల కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించారు. ఈనేపథ్యంలో తాడేపల్లిలోని సీఎం క్యాంపు ఆఫీస్ నుంచి నియోజవర్గానికి వస్తున్న ఆయనకు పార్టీ శ్రేణులు బోయపాలెం గ్రామంలో ఘనంగా స్వాగతం పలికారు. జాతీయ రహదారి పక్కనే పార్వతీదేవి లాలయంలో నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డితో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ర్యాలీ పట్టణానికి తరలివెళ్లారు.

24న బొగ్గరం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ తిరునాళ్ల



ఈపూరు: మండలంలోని బొగ్గరంలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ తిరునాళ్ల ఈనెల 24వ తేదీన నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా శివరాత్రి పర్వదినం అనంతరం వచ్చే పాల్గుణ శుద్ధ పంచమి రోజు తిరునాళ్ల నిర్వహించటం ఆనవాయితీ. దేవాలయం ప్రాంగణంలో సంతాన వేణుగోపాల స్వామి దేవాలయం ప్రసిద్ధి. బొగ్గరంతో పాటు, కొండాయపాలెం, చిట్టాపురం, ఇర్లపాడు, పోట్లూరు నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. భక్తులు తమ మొక్కుబడులకు తీర్చుకునేందుకు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక



బొల్లాపల్లి: బాస్కెట్‌బాల్ జాతీయస్థాయి జట్టుకు మండలంలోని వెల్లటూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.నాగేశ్వర రావు సోమవారం తెలిపారు. అండర్ -14, 17 విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ఇటీవల నూజివీడు, విజయవాడలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి చెన్నంశెట్టి రాంబాబు, కె.శివ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులను సోమవారం అభినందించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.గురునాథం, గ్రామ సర్పంచి ఎం.చినవీరయ్య, ఎంపీటీసీ సభ్యుడు జి.చినవీరయ్య, మండల ఉపాధ్యక్షులు టి.కోటిరెడ్డి, పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం

రీజనల్ కో ఆర్డినేటర్ వెంకటరావు



యడ్లపాడు: ప్రస్తుతం రబీ సాగులో చిరుధాన్యాల సాగు చేయడం లాభదాయకంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ రైతు సాధికార సంస్థ ఉమ్మడి గుంటూరు జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు చెప్పారు. నరసరావుపేట డివిజన్ యడ్లపాడు మండలం లింగారావుపాలెంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో 5 రకాల జాతుల 30 రకాల బీజామృతంతో శుద్ధిచేసిన విత్తనాలను చల్లి 45 రోజుల తర్వాత కలియదున్నడం వలన నేలలో జీవవైవిధ్యం పెరిగి ప్రధాన పంటకు కావల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. తద్వార నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ప్రకృతి సాగు విధానంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించి, ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు రైతులు పొందవచ్చన్నారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ మనోజ్ కుమార్, నందకుమార్, జగదీష్, సౌజన్య, మల్లేశ్వరీ, నరసింహారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బల్లలు, కుర్చీలు బహూకరణ

బాలెమర్రు(క్రోసూరు): గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన ముసులూరి నాగేశ్వరరావు 12 బల్లలు, రెండు కుర్చీలు, రెండు టేబుళ్లు బహూకరించారు. సోమవారం పాఠశాల హెచ్‌ఎం తూమాటి శరత్‌కమార్‌కు వాటిని అందజేశారు. ఎంఈఓలు వై.వెంకటేశ్వరరావు, జి.యేసురత్నం, ఏకుల ప్రసాదరావు పాల్గొని, దాతను అభినందించారు.

జగనన్న సైన్యంలా పనిచేయాలి

సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో మంత్రి విడదల రజిని



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పార్టీ విజయానికి జగనన్న సైన్యంలా పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో చిలకలూరిపేట పట్టణ పరిధిలోని జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల సమన్వయ సమావేశం సోమవారం నిర్వహించారు. మంత్రి రజిని మాట్లాడుతూ జగనన్న చేస్తున్న మంచిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో గెలుపు లక్ష్యాన్ని నిర్దేశించారని, లక్ష్య సాధనలో క్రియాశీలంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను అమలు చేసేందుకు ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ ఉంటే, పార్టీ విజయానికి, పార్టీ ప్రణాళికలు అమలు చేసేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను నియమించటం జరిగిందని చెప్పారు. వీరందరికీ మండల, జిల్లా, రాష్ట్ర పార్టీ నాయకత్వాలు దిశ నిర్దేశం చేస్తాయని వెల్లడించారు. ఇంటింటికీ తిరిగి ప్రజా మద్దతు పుస్తకం ద్వారా ప్రభుత్వం చేస్తున్న మేలు, ప్రజలకు జరిగిన ప్రయోజనాలు వివరించి వారి అభిప్రాయం సేకరించాలని కోరారు.

మా నమ్మకం నువ్వే జగనన్న అనే భావన ప్రజల్లో కలగజేయాల్సిన బాధ్యత ఉందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన ప్రతి హామీని విస్మరించి ప్రజలను మోసగించారని, బాబు ఎప్పుడూ హామీలు ఇచ్చేది మోసం చేయడానికే కాని అమలు చేయడానికి కాదన్న విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని చెప్పారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు(రాము) మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ విధానాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. జేసీఎస్ కన్వీనర్ తోట బ్రహ్మస్వాములు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్నా, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, షేక్ గాలిబ్ షా, షేక్ అల్లీమియా, వడితే కోట్యానాయక్, బేరింగ్ మౌలాలి, గుంజి వీరాంజనేయులు, దాసరి మర్ధు పాల్గొన్నారు.

యడ్లపాడులో..

యడ్లపాడు: మా నమ్మకం జగన్ నువ్వే జగన్ కార్యక్రమం యడ్లపాడు గ్రామంలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పార్టీ నుంచి వచ్చిన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యార్డు తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్ ఎం.వీరారెడ్డి, ఎంపీపీ పిడతల ఝాన్సీ, మండల కోఆప్షన్ మెంబర్ షేక్ గౌస్‌సందాని, పార్టీ సీనియర్ నాయకులు కల్లూరి విజయ్‌కుమార్, ఘంటా శంకర్, రాచమంటి చింతారావు, మాదం శ్రీను, కర్నాట సుబ్బారావు, వడ్డేపల్లి నరసింహరాజు, ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, బసెల శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే బొల్లా జన్మదిన వేడుకలు



భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పీఎస్ ఖాన్, కాపు నాయకుడు ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ బైక్, కారు ర్యాలీ నిర్వహించారు. విఠంరాజుపల్లి గ్రామం నుంచి ఊరేగింపుగా కారంపూడి రోడ్డులోని బొల్లా కన్వెన్షన్ హాల్ వద్దకు చేరుకొని అభిమానులు, కార్యకర్తల నడుమ ఎమ్మెల్యే భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ తనపై ఆదరాభిమానాలు చూపుతున్న నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. రానున్న రోజుల్లో వినుకొండ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. తాగునీటి సమస్య, పేదలందరికి ఇళ్ల నిర్మాణం, నూతన కళాశాలలు, మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

శావల్యాపురంలో..

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జన్మదిన వేడుకలు పార్టీ మండల నాయకులు తెలప్రోలు రాఘవేంద్రరావు సారథ్యంలో సోమవారం నిర్వహించారు. తౌలుత గ్రామంలో వేంచేసియున్న శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. 20 కేజీల కేకును కట్ చేశారు. అనంతరం 400 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు యువసేన అధ్యక్షులు కర్ణా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు మలిశెట్టి నరేష్, మాజీ ఎంపీపీ గుత్తా కోటేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు స్వర్ణాల వెంకట్రావు, నాయకులు తెలప్రోలు రవీంద్రబాబు, వడ్లాణం నాగేశ్వరరావు, గౌతమ్, చిలుకూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: టీడీపీ మునిగిపోయే నావ వంటిదని, అందుకే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో భారీగా చేరుతున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పసల హనుమంతరావు, పసల వెంకట సుబ్బయ్య, పసల ఏసుబాబు, అనిపినేని గోవిందు తమ అనుచరులతో కలసి మంత్రి విడదల రజిని సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి రజిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ వర్గానికి మేలు చేయలేని టీడీపీ విధానాలతో విసిగిపోయిన ఆ పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు.

'నవోదయం'లో ముగ్గురికి ఉద్యోగాలు

- నియామక పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్ శివశంకర్
- మహిళకు కారు అందజేత



కలెక్టర్ శివశంకర్ నుంచి నియామకపత్రాలు అందుకుంటున్న అభ్యర్థులు

నరసరావుపేట: జిల్లాలో నవోదయం ద్వారా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న ముగ్గురికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామక పత్రాలను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం కలెక్టరేట్‌లో అందజేశారు. నకరికల్లు మండలం చల్లగుండ్ల బాల,బాలికల వసతి గృహంలో వాచ్‌మెన్‌గా జాలాది కమల, నరసరావుపేట అంధుల వసతి గృహంలో వాచ్‌మెన్‌గా నక్క సుభాషిని, ఆఫీస్ సబార్డినేట్‌గా గుండు మణికంఠ నియమితులయ్యారు. గతకొంత కాలంగా జిల్లా విభిన్న ప్రతిభావంతులు, చిన్నారులు, వృద్ధుల సంక్షేమ శాఖ మూడు ప్రభుత్వ శాఖలో పలు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. దీనిని భర్తీ చేయాలని ఆ శాఖ అధికారిణి సువార్త ఇటీవల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. నవోదయం ద్వారా పలువురు నిరుద్యోగులు ఉద్యోగాలకోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. సమస్యను పరిష్కరించిన కలెక్టర్‌కు అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త, నవోదయం నోడల్ అధికారి సంజీవరావు ధన్యవాదాలు తెలిపారు.

మహిళకు కారు అందజేత

నవోదయం కార్యక్రమం కింద రామావత్ కోటిబాయి అనే మహిళ ఉపాధికోసం నవంబర్ 14న దరఖాస్తు చేసుకున్నారు. వైఎస్సార్ బడుగు వికాసం పథకం ద్వారా రూ.14.29 లక్షల విలువ చేసే కారును 45 శాతం సబ్సిడీతో స్టేట్ బ్యాంకు రుణం సహకారం అందించగా జిల్లా కలెక్టర్ శివ శంకర్ చేతుల మీదుగా కారును లబ్ధిదారుకు అందించారు. తమకు నవోదయం ద్వారా ఉపాధి అవకాశం చూపిన కలెక్టర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోండి



సుభాష్‌ను సత్కరించుతున్న బీ.ద.చేంజ్ సంస్థ ప్రతినిధులు,అధికారులు

శావల్యాపురం: ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు నైపుణ్యాలు పెంపొదించుకోవాలని ప్రముఖ గిన్నీస్ బుక్ రికార్డు హోల్డర్, సైకాలజిస్ట్ మొగిలి సుభాష్ సూచించారు. మండలంలోని వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బీ.ద. చేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సైకాలజిస్ట్ సుభాష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత, ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య, ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు, బీ.ద.చేంజ్ సంస్థ సభ్యులు పాపసాని సురేష్, చుండూరి హేమంత్, చిన్నకొండ మల్లికార్జునరెడ్డి, టి.బ్రహ్మారెడ్డి, కె.విజయ్‌బాస్కర్, వజ్రా, వెంకట్, ముండ్లమూరి అవినాష్, డేవిడ్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల హబ్‌గా ఏపీ

- ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి
- బోయపాలెంలో డ్రాగన్‌ఫ్రూట్ సాగు పరిశీలన



బోయపాలెంలోని కోలా పోలేశ్వరరావు డ్రాగన్ ఫ్రూట్ తోటలను పరిశీలిస్తున్న దృశ్యం

యడ్లపాడు: రైతుకు మించిన శాస్త్రవేత్త లేదని.. విదేశీ పంటను మన రాష్ట్రంలో ఆవిష్కరించి కొత్త విధానంతో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటలే నిదర్శనమని ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి చెప్పారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెం సమీపంలో 13 ఎకరాల్లో సాగు చేస్తున్న డ్రాగన్‌ఫ్రూట్ క్షేత్రాన్ని ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులతో కలసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతు కోలా పోలేశ్వరరావును డ్రాగన్‌ఫ్రూట్ పంట సాగు విధానం, పెట్టుబడి, డ్రాగన్‌ఫ్రూట్ రకాలు, దిగుబడి, మార్కెటింగ్ తదితర విషయాలను అధికారులతో పాటు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పోలేశ్వరరావు తోటల్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎంవీఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ రైతులు మూస విధానంతో సాగు చేయడం మంచిది కాదన్నారు. లాభాలు వచ్చే పంటల వైపు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఏపీ అగ్రికల్చర్ మిషన్ పనిచేస్తోందని వివరించారు. డ్రాగన్ ఫ్రూట్ సాగు అన్ని ప్రాంతాలకు అనువైనదని, అనంతపురం, గుంటూరు, తెలంగాణ వంటి అన్నిచోట్ల నేడు ఎకరం నుంచి 10 ఎకరాలు వరకు రైతులు సొంత ఆలోచనతో సాగు చేస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. పెట్టుబడి అధికం కావడంతో చిన్నరైతులు సాహసించడం లేదని, పెద్దరైతులు ఇటువంటి లాభదాయకమైన పంటలపై మొగ్గుచూపితే మేలు జరుగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మిషన్ సభ్యులు జె.రామారావు, ఉద్యాన శాఖ ఏడీ ఎం.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం బోర్డు మెంబర్ జె.వెంకటేశ్వరరావు, టెక్నికల్ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, రైతు సాధికారిక సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ వెంకట్రావు, పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ పీడీ కె.అమలకుమారి, చిలకలూరిపేట హెచ్‌ఓ కిషోర్‌కుమార్, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, యడ్లపాడు ఏఓ సీహెచ్ సరిత పాల్గొన్నారు.

బ్యాంక్ ఎదుట డ్వాక్రా సభ్యుల నిరసన



యడ్లపాడు యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేస్తున్న బ్లెస్సీ సంఘం సభ్యులు

యడ్లపాడు: స్థానిక యూనియన్ బ్యాంకు బ్రాంచి ఎదుట స్వయం సహాయక సంఘాల సభ్యులు సోమవారం నిరసన తెలిపారు. సభ్యులకు సమాచారం లేకుండా యానిమేటర్ రుణం తీసుకున్నారు. బాధితులు తెలిపిన వివరాలు.. తిమ్మాపురం గ్రామానికి చెందిన బ్లెస్సీ, అశ్విత గ్రూపులు స్థానిక యూనియన్ బ్యాంకులో ఖాతాలున్నాయి. తాజాగా ఈ రెండు గ్రూపులు రూ.10 లక్షల చొప్పున రుణాన్ని పొందినట్లు అధికారులు చెబుతున్నారు. రుణం డబ్బుల్లో రూ.54 వేలు కట్ కావడంతో సంఘ సభ్యులు బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లారు. గతంలోనే సంఘం పేరిటా రుణం ఇచ్చినట్లు చెప్పడంతో యానిమేటర్ మోసం చేసినట్లు గుర్తించి ఆందోళన చేపట్టారు. విషయంపై వైఎస్సార్ క్రాంతిపథం యడ్లపాడు ఏపీఎం జగ్జీవన్‌రావును వివరణ కోరగా యానిమేటర్ వనజ నిబంధనలకు విరుద్ధంగా సంఘ సభ్యులకు తెలియకుండా ఐదుగురు కొత్త సభ్యులతో రెండు బ్యాంకుల్లో ఖాతాలు ప్రారంభించి తమను, బ్యాంకును తప్పుదారి పట్టించిందన్నారు. ఈ మేరకు బ్యాంక్ నుంచి రూ.10.43 లక్షలు తీసుకుందన్నారు. వెంటనే బ్యాంక్ అధికారుల నుంచి సదరు రుణాల వివరాలు తీసుకుని సమగ్ర విచారణ చేయనున్నట్లు చెప్పారు. నివేదికను ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

పన్ను బకాయిలు చెల్లించకుంటే చర్యలు



దుకాణం యజమానితో మాట్లాడుతున్న పురపాలక ఆస్తి పన్ను అధికారులు

నరసరావుపేట: పట్టణ పరిధిలోని పన్ను బకాయిదారులు ఇచ్చిన గడువు లోగా పన్ను చెల్లించకపోతే పురపాలక శాఖ సదరు ఆస్తిని స్వాధీనం చేసుకుంటుందని మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ ఆర్ఐలు అబ్దుల్ జబ్బార్, సూర్యనారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది గత కొన్ని నెలలుగా ఆస్తి పన్ను చెల్లించకుండ ఉన్న బకాయిదారుల దుకాణాలపై దాడులు చేశారు. కూరగాయల మార్కెట్ వద్ద లీగల్ నోటీసులు స్వీకరించినా పన్ను చెల్లించని ఆస్తిని జప్తు చేసేందుకు ఉపక్రమించారు. పన్ను బకాయిదారుడు అక్కడికి అక్కడే పన్ను చెల్లించి రశీదు తీసుకున్నారు. మరి కొందరు రేపు ఉదయం కల్ల పన్ను చెల్లిస్తామని గడువు కోరారు. ఈ మేరకు కుళాయి, ఆస్తిపన్ను బకాయి దారులు ఎవరైనా ఉంటే త్వరితగతిన చెల్లించి మునిసిపల్ అధికారులకు సహకరించాలని అయన కోరారు.

దొంగతనం కేసులో నిందితుడి తల్లి ఆరోపణలు అవాస్తవం

నరసరావుపేట: దొంగతనం కేసు నుంచి తప్పించేందుకు మాచర్ల సీఐ రూ.1.20లక్షలు డిమాండ్ చేశాడని, స్పందనలో ఫిర్యాదు చేయడానికి వస్తే కార్యాలయంలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని నిందితుడి తల్లి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తమని జిల్లా పోలీసు కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడైన వ్యక్తి దొంగిలించిన సొమ్ములో రూ.1.20లక్షలు వాడుకున్నాడని, వాటిని తిరిగి ఇస్తే బాధితులకు అందజేస్తామని నిందితుడి కుటుంబ సభ్యులకు మాచర్ల సీఐ చెప్పారన్నారు. దానిని వక్రీకరించి కేసు నుంచి తమ బిడ్డను తప్పించడానికి సీఐ నగదు డిమాండ్ చేశాడని నిందితుడి తల్లి ఆరోపించడం పూర్తిగా అవాస్తవమన్నారు. బాధితులకు న్యాయం చేయడానికి చూస్తున్న పోలీస్ వారిపై ఇటువంటి ఆరోపణలు చేయడం వారి మనోధైర్యాన్ని దెబ్బతీయడమే అవుతుందన్నారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించి ప్రతి ఫిర్యాదును సంబంధిత డీఎస్పీ పర్యవేక్షణలో నిర్ణీత కాలంలోనే వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశిస్తున్నారన్నారు. ఇటువంటి ఆరోపణలు వచ్చినప్పుడు పోలీస్ వారి వివరణ కూడా తీసుకోవాలని మీడియా ప్రతినిధులను కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట టౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా పట్టణంలోని పలు ప్రాంతాలలో మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఆర్.అశోక్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి ఒంటిగంట వరకు కరెంట్ ఉండదని చెప్పారు. పట్టణంలోని గుండయ్యతోట, రాగన్నపాలెం, బొందిలిపాలెం, వడ్డెరపాలెం, బ్రహ్మంగారిగుడి బజారు, ఆవుల దొడ్డి ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

మున్సిపల్ సాధారణ సమావేశం నేడు

వినుకొండ(నూజెండ్ల): మున్సిపల్ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మున్సిపల్ సమావేశం హాల్‌లో నిర్వహించనున్న సమావేశానికి చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షత వహిస్తారని చెప్పారు. వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: ప్రభుత్వ పథకాలను డ్వాక్రా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కారుమంచి సొసైటీ చైర్మన్ బొల్లా వెంకట సాంబశివరావు కోరారు. మండలంలోని కారుమంచి సొసైటీ బ్యాంకు ప్రాంగణంలో గ్రూపు సభ్యులకు వడ్డీ రాయితీ పంపిణీ, సొసైటీ క్యాలెండరు ఆవిష్కరణ, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ 73 మహిళా గ్రూపులు ఉండగా రూ.5లక్షల 80 వేల వడ్డీ రాయితీ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వినుకొండ సొసైటీ బ్యాంకు మేనేజరు బత్తుల బాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ అమూల్ పాడి పోషకులకు 30 మందికి ఒక్కొక్కరికి రూ.30 వేలు చొప్పున రుణాలు మంజూరు చేశామన్నారు. అలాగే మహిళా సభ్యులకు వ్యక్తిగత రుణాలను రూ.50 వేల చొప్పున 34 మందికి మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ బొప్పుడి వెంకటేశ్వర్లు, సీఈఓ ఏరువా వెంకట నారాయణ, సీసీ బేబిరాణి పాల్గొన్నారు.

అక్రమ మట్కా కేసులో ఇద్దరి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మట్కా కేసులో ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి రూ.2,300 స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు సోమవారం తెలిపారు. వివరాలు.. నాగుర్‌వలి టాకీస్ సమీపంలో దాడులు నిర్వహించి అక్కడ మట్కా జూదానికి పాల్పడుతున్న బాలయ్య, మాలిక్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా కపోతేశ్వరస్వామి తిరునాళ్ల



నకరికల్లు: చేజర్లలోని కపోతేశ్వరస్వామి తిరునాళ్ల సోమవారం కనులపండువగా నిర్వహించారు. అర్చకులు కొండకావూరి వెంకట్రామయ్యశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి తిరునాళ్ల మహోత్సవం జరిపించారు. ముందుగా సుప్రభాతసేవ, మేలుకొలుపు, రుద్రహోమం, బలిహరణ, గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామిని నాలుగు వాహనాలపై ఊరేగించారు. విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

ఈ-కేవైసీతో రైతులకు మేలు

నకరికల్లు: రబీలో పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. చల్లగుండ్ల, చీమలమర్రి, కండ్లకుంట గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంటలకు ఈ-కేవైసీ చేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల సమయంలో బీమా ద్వారా న్యాయం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామవ్యవసాయ సహాయకులు కె.దిలీప్‌కుమార్, జి.జగదీష్, ఎం.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.